క్లుప్తంగా

బాధిత కుటుంబానికి బోస్ పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న బోస్, సూర్యప్రకాష్ తదితరులు

కె.గంగవరం: మండల పరిధిలోని యర్రపోత వరం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ వాసంశెట్టి శ్రీనివాస్ తండ్రి వాసంశెట్టి వెంకట్రావు ఇటీవల అకాల మరణం చెందారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైఎస్సార్ సీపీ రామచంద్రపురం ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

హామీల అమలుకు కట్టుబడి ఉంటాం

మండపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డితో కలసి వేగుళ్ల మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెట్టాలంటే సీఎం నారా చంద్రబాబు నాయుడితోనే సాధ్యమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మొదటి సంతకంతోనే ఐదు హామీలు అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

పీఎంపీల సమస్యలు పరిష్కరిస్తాం

మండపేట: ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ల (పీఎంపీ) సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు పీఎంపీలు ఆదివారం పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్లను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పీఎంపీలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. తమ ప్రభుత్వంలో పీఎంపీల సమస్యలకు పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పీఎంపీ నాయకులు సూరంపూడి వీరభద్రరావు, బల్లా వెంకటరమణ, మట్టా వీరబాబు, వానపల్లి కనకరాజు, గన్నేడ సురేష్, సభ్యులు విష్ణు, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయాల సముదాయ వార్షికోత్సవ పూజలు

కపిలేశ్వరపురం: వల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, అయ్యప్పస్వామి, షిరిడి సాయిబాబా వార్ల దేవాలయాల సముదాయం 13వ వార్షికోత్సవ పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివార్లకు పంచామృతాభిషేకం, విశేష అర్చనలు, బాల భోగము, నీరాజన మంత్ర పుష్పం పూజలు చేశారు. అమ్మవార్లను పెండ్లి కుమార్తెలు గాను, స్వామివార్లను పెండ్లి కుమారుల గానూ అలంకరించి పూజలు చేశారు. సోమవారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం పూజలు నిర్వహించనున్నట్టు పండితులు తెలిపారు. ఈనెల 22 వరకూ ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10,116 విరాళం



దాత కోమలా ఫణికి స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన చిలుకుల కోమలా ఫణి ఆదివారం రూ.10,116 విరాళంగా ఇచ్చారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేద మంత్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన వేణుగోపాలస్వామి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి గ్రామంలో వేంచేసిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు కన్నులపండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. ఈ నెల 17 నుంచి 23 వరకు స్వామి వారి కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. స్వామి వారి కల్యాణోత్సవాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

షిఫ్ట్ సిస్టమ్.. చదువుకు కష్టం

- ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఒకే చోట బోధన
- గడచిన పదేళ్లుగా ఇదే తంతు
- – తర'గతి' గదులు 'లేక' అవస్థలు



కృత్తివెంటి విద్యా సంస్థలు

రామచంద్రపురం: వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన మహోన్నతమైన విద్యా సంస్థ ఎంతోమంది మహానుభావులకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల... మొదట్లో 1వ తరగతి నుంచి ప్రారంభమై నేడు డిగ్రీ కళాశాల వరకు అభివృద్ధి చెందింది. కానీ కళాశాలలో తరగతి గదుల కొరత ఏర్పడి విద్యార్థులు నానా కష్టాలు పడుతున్నారు. రామచంద్రపురం పట్టణంలోని కృత్తివెంటి విద్యాసంస్థల ప్రాంగణంలో పాఠశాలను విద్యాదాత కృత్తివెంటి పేర్రాజు పంతులు నెలకొల్పి వందేళ్లు దాటింది. అది అంచెలంచెలుగా ఎదిగి హైస్కూల్‌తో పాటుగా ఇంటర్ విద్యను కూడా బోధిస్తున్నారు. ఇంటర్ కళాశాల ఏర్పడి సుమారుగా 50 ఏళ్లు అవుతోంది. 2014లో స్థానిక ప్రజా ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకుల కృషితో డిగ్రీ కళాశాల ఏర్పాటైంది. అయితే కళాశాల అయితే ఏర్పాటు చేశారు గానీ దానికి సంబంధించిన వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేయటంలో అశ్రద్ధ వహించారు. ఇప్పటికే కృత్తివెంటి విద్యాసంస్థల్లో హైస్కూల్‌తో పాటుగా ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. దానికితోడు డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేయటంతో తరగతి గదుల కొరత ఏర్పడింది. విద్యాసంస్థల ప్రాంగణంలో ఇంటర్‌లో సుమారుగా ఏటా 500 నుంచి 600 మంది వరకు విద్యనభ్యసిస్తూ ఉండేవారు. పదేళ్ల క్రితం వరకు

ఇంటర్ తరగతులను ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించేవారు. రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, రాయవరం మండల గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో కళాశాలకు విద్యార్థులు చేరుకునేవారు. 2014లో విద్యా సంస్థల ప్రాంగణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశాక ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు తరగతులను నిర్వహించేందుకు ఇబ్బందులు మొదలయ్యాయి. తరగతి గదుల కొరత కారణంగా ఇంటర్ విద్యార్థులకు ఉదయం పూట, డిగ్రీ విద్యార్థులకు మధ్యాహ్నం పూట తరగతులను నిర్వహిస్తున్నారు. ఇంటర్‌కు ఉదయం 8 నుంచి 12.30 గంటల వరకు, డిగ్రీ విద్యార్థులకు మధ్యాహ్నం 12.45 నుంచి సాయంత్రం 5.35 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఉదయం పూట ఇంటర్ విద్యార్థులు కళాశాలకు వచ్చేందుకు, సాయంత్రం పూట డిగ్రీ విద్యార్థులు ఇంటికి చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 10 ఏళ్లుగా ఈ కళాశాలలో ఇదే పరిస్థితి ఉంది. విద్యార్థులతో పాటుగా అధ్యాపకులకు కూడా షిఫ్ట్‌ల వారీగా విద్యార్థుల తరగతులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. షిఫ్ట్‌ల కారణంగా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పూర్తి స్థాయిలో విద్యాబోధన అందించడం కష్టమవుతోందనే వాదన ఉంది. డిగ్రీ కళాశాలను పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు సుమారు 20 తరగతి గదులు అవసరం అవుతాయి. కానీ ప్రస్తుతానికి ఎనిమిది గదుల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇంటర్ తరగతుల అనంతరం మాత్రమే అదే గదుల్లో డిగ్రీ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. వీటిని అధిగమించి పూర్తి స్థాయిలో తరగతి గదులు ఏర్పాటు చేసి ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు మంజూరయ్యాయి



ఏటా డిగ్రీ విద్యార్థులు పెరుగుతున్నారు. నాణ్యమైన విద్యాబోధన కారణంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలే విద్యార్థులు వస్తున్నారు. తరగతి గదుల కొరత కారణంగా షిఫ్ట్‌లో విద్యాబోధన జరుగుతోంది. అయితే పీఎం నిషా పథకం ద్వారా కళాశాలలో తరగతి గదుల నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు అయ్యాయి. త్వరలోనే గదుల నిర్మాణం అనంతరం షిఫ్ట్‌ల పద్ధతి తీసివేసి పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహిస్తాం.

– డాక్టర్ కేసీ సత్యలత, ప్రిన్సిపాల్, డిగ్రీ కళాశాల

కుంగ్-ఫు బెల్ట్ టెస్టుల్లో సత్తా చాటిన విద్యార్థులు



పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందించిన మాస్టర్ రాజబాబు

మండపేట: న్యూ డ్రాగన్ చైనీస్ కుంగ్-ఫు (ఎన్‌డీసీకే) బెల్ట్ టెస్ట్ పోటీలు ఆదివారం ఉదయం స్థానిక గోల్డ్ మార్కెట్ వీధిలోని ఓ భవనంలో నిర్వహించారు. ఎన్‌డీసీకే గ్రాండ్ మాస్టర్ పిట్టా రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల వివిధ విభాగాల్లో విద్యార్థులు తాము నేర్చుకున్న విద్య ప్రదర్శించి బెల్ట్‌లు గెలుచుకున్నారు. ప్రతిభ కనబరిచిన రంది చక్రి ధరహస్, జైవీర్, వాసంశెట్టి హేమాన్స్ శ్రీసాయి, వారా యశ్వన్ కుమార్, ముమ్మిడివరపు రిత్విక్‌లకు ఎల్లో బెల్ట్‌లు దక్కాయి. అలాగే ఊడి ఈశ్వర్, రిమ్మలపూడి శ్రీవాత్సవ్‌లు ఆరెంజ్ బెల్టులు పొందారు. కొత్త సంజయ్ గ్రీన్ బెల్ట్, రిమ్మలపూడి సూర్య శ్రీకృష్ణ భూపతి బ్రౌన్ బెల్ట్‌లు కైవసం చేసుకున్నారు. గ్రాండ్ మాస్టర్ రాజబాబు వారికి సర్టిఫికెట్లు అందించారు.

బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

కాజులూరు: రాజమహేంద్రవరం డిపో నుంచి మండలంలోని మంజేరు గ్రామానికి వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులను అధికారులు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ఆదివారం కాజులూరులో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ తదితరులు విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరం నుంచి రామచంద్రపురం, ద్రాక్షారామ మండలంలోని కుయ్యేరు, దుగ్గుదుర్రు, కాజులూరు, చేదువాడల మీదుగా రోజూ ఒక బస్సు నాలుగు పర్యాయాలు మంజేరు వచ్చి వెళ్ళేదన్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఈ బస్సును నిలుపుదల చేసిన అధికారులు ఆపై పునరుద్ధరించలేదన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి రోజూ అధిక సంఖ్యలో ప్రయాణికులు రామచంద్రపురం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలకు వెళుతుంటారని అధికారులు స్పందించి బస్సు సర్వీసులను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలన్నారు. మంజేరు పీఏసీఎస్ అధ్యక్షుడు దడాల భీమేశ్వరరావు, చేదువాడ సర్పంచ్ గంజా సూరిబాబు, కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి తదితరులు బస్సు కోసం డిమాండ్ చేసిన వారిలో ఉన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల సంబరాలు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు రామచంద్రపురం నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి సుభాష్ విజయోత్సవ ర్యాలీలో ఆ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని సంబరాలు నిర్వహించారు. రామచంద్రపురం పట్టణ సరిహద్దు పసలపూడి బైపాస్ రోడ్డు నుంచి ద్రాక్షారామ భీమేశ్వరాలయం వరకూ కార్లు, బైకులతో ర్యాలీ చేశారు. దారి పొడవునా బాణసంచా కాల్చి, పూల దండలతో ముంచెత్తారు.

నిబంధనలు పాటించని ఆర్వో ప్లాంట్లపై చర్యలు తప్పవు



వాకలగరువులో ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో సరోవర్

అంబాజీపేట: ప్రభుత్వ అనుమతితో పాటు నిబంధనలు పాటించని ఆర్వో ప్లాంట్లపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ జీవీ సరోవర్ హెచ్చరించారు. ఈ నెల 16వ తేదీన సాక్షి దిన పత్రికలో 'నాణ్యతకు నీళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి వాకలగరువులో ఉన్న ఆర్వో ప్లాంట్‌ను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడిపే ప్లాంట్లను గుర్తించి సీజ్ చేస్తామన్నారు. మండలంలోని ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామన్నారు.

నారాయణరెడ్డికి వాకర్స్ క్లబ్ నివాళి



నారాయణరెడ్డి ఆత్మకు శాంతి కలగాలంటూ మౌనం పాటిస్తున్న క్లబ్ సభ్యులు

మండపేట: స్థానిక డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది స్వర్గీయ కేఆర్‌సీ నారాయణరెడ్డికి వాకర్స్ క్లబ్ ఘన నివాళి అర్పించింది. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైఎస్సార్ పార్కులో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పుష్పాంజలి ఘటించారు. సభ్యులంతా కాసేపు మౌనం పాటించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. న్యాయవాదిగా ఎంతో మంది పేదలకు ఉచిత న్యాయ సలహాలు అందించిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రెడ్డి రాజు, దూలి జయరాజు, మోరంపూడి సుబ్రహ్మణ్యం, కేశవరపు శ్రీనివాస్, గంపల సత్యప్రసాద్, త్రిశూల వెంకట్రావు, లంక సత్తిబాబు, తాతపూడి సుధీర్, ఈశ్వరరావు, ప్రకాశరావు, సాయిబాబా, మంగరాజు పాల్గొన్నారు.

తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలి

కాజులూరు: తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపాలెం, బందనపూడి తదితర గ్రామాలలో వ్యవసాయాధికారి పర్యటించి, తొలకరి సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి తూర్పు డెల్టా కాలువకు ఇరిగేషన్ అధికారులు ఈ నెల ఒకటో తేదీన సాగు నీరు విడుదల చేశారన్నారు. రుతు పవనాల ప్రభావంతో చెదురుమదురుగా వర్షాలు పడుతుండటానికి తోడు పంట కాలువల ద్వారా పొలాలకు సాగునీరు చేరుతుందని, రైతులు పంట దమ్ములకు సిద్ధం కావాలన్నారు. జూన్ మూడో వారం నాటికి నారుమడులు చల్లుకుని జూలై రెండో వారం నాటికి నాట్లు పూర్తిచేస్తే అక్టోబరు నెలాఖరు నాటికి పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా చేతికొస్తుందన్నారు. తద్వారా నవంబరు, డిసెంబరు నెలల్లో దాళ్వా సాగు చేపట్టి, మార్చి, ఏప్రిల్ నెలల్లో అంతర పంటలైన పెసర, మినుము మూడో పంటగా సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులు చొరవ చూపి సాధ్యమైనంత త్వరగా తొలకరి పనులు ప్రారంభించాలన్నారు.

ఇసుక నిల్వలు తరలిస్తున్నవారిని శిక్షించాలి

ప్రజాప్రతినిధుల డిమాండ్



కపిలేశ్వరపురంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు

కపిలేశ్వరపురం: అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు మండలంలోని ఇసుక నిల్వలను అక్రమంగా తరలిస్తున్నారని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు విమర్శించారు. కపిలేశ్వరపురంలో ఆదివారం ఎంపీపీ సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు గొల్లపల్లి సోనియా, పలివెల మధు, శీలం భాస్కరరావు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లోని ఇసుక ర్యాంపుల్లో వరదల కాలంలో వినియోగార్థం గత ప్రభుత్వం ఇసుక నిల్వలను ఉంచిందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కూటమి నేతల ప్రోద్బలంతో అక్రమంగా రాత్రివేళ తరలిస్తున్నారన్నారు. లారీ రూ.12 వేల చొప్పున విక్రయిస్తున్నారని, ఈ విషయాన్ని మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదని ఆరోపించారు. ఇసుక నిల్వలను విక్రయిస్తున్న అక్రమార్కులపై చట్ట పరిధిలో కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన ఇసుక విధానం ప్రకటించే వరకూ ఉన్నతాధికారులు స్పందించి ఇసుక నిల్వలను పరిరక్షించాలని కోరారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు విన్నవించినట్టు ఎంపీపీ తదితరులు చెప్పారు.

శిథిల పాఠశాల భవనాన్ని తొలగించాలి



మొగలిపాలెంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

కాజులూరు: బందనపూడి శివారు మొగలిపాలెంలో శిథిలావస్థలో ఉన్న మండల పరిషత్ పాఠశాల భవనాన్ని తొలగించి ఆ స్థానంలో కమ్యూనిటీ హాలును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో సుమారు 40 ఏళ్ల క్రితం అప్పటి తాళ్లరేవు సమితి అధ్యక్షుడు పబ్బినీడి సత్యనారాయణ ఆధ్వర్యంలో భవన నిర్మాణం చేపట్టి ప్రారంభోత్సవం చేశారు. క్రమేపీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 15 సంవత్సరాల క్రితం పక్కనే జిల్లా పరిషత్ నిధులతో మరో భవనం నిర్మించి పాఠశాలను అందులోకి తరలించారు. పాత భవనం గోడలు పగుళ్లు తీసి శ్లాబు పైభాగం పెచ్చులు ఊడి పడుతుండడంతో ఇది ఏక్షణాన కూలిపోతుందోనని గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వివిధ కులాలకు చెందిన 600 మంది జనాభా ఉన్నారు. ఏ శుభకార్యం వచ్చినా సమావేశం జరిగినా భవన సదుపాయం లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, పాలకులు స్పందించి శిథిల పాఠశాలను తొలగించి, ఆ స్థానంలో కమ్యూనిటీ హాలును నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు

గ్యాస్ విస్ఫోటాలతో కోనసీమ ఎడారి



చింతలపల్లిలో గ్యాస్ లీకైన బోరుబావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

రాజోలు: ఓఎన్జీసీ, గెయిల్ సంస్థల కార్యకలాపాలతో పాటు తరచూ జరుగుతున్న గ్యాస్ విస్ఫోటనాలతో కోనసీమ సహారా ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం చింతలపల్లి గ్రామంలో బోరు బావి నుంచి గ్యాస్ లీకైన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. కోనసీమ ప్రాంతాల్లో బోరు వేసుకోవాలంటే ప్రజలు భయపడుతున్నారన్నారు. ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు భూమిలో వేసిన కాలం చెల్లిన పైపులైన్లను మార్చాలన్నారు. గ్యాస్ లీకేజీల కారణంగా పచ్చని పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది కుడిపూడి త్రినాథ్, కరుణాకర్, చెల్లుబోయిన వెంకటరమణ, కట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది సభ్యులతో ఉత్సవ కమిటీ



అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఉత్సవ కమిటీ సభ్యులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని తొమ్మిది మంది సభ్యులతో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తూ ఎండోమెంట్ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా తులా ఉమామల్లేశ్వర స్వామి, బొంతు ఆనందరావు, పడవల వీవీఎస్ మల్లేష్, కామిశెట్టి సూర్యచంద్ర, మాకే సత్యశ్రీధర్, కోలా రాంబాబు, పాటి వెంకట్రావు, కేతా శ్రీనివాస్, కంకిపాటి సుబ్బారావును నియమించారు. కమిటీ సభ్యులు ఆదివారం బాల బాలాజీ స్వామిని దర్శించుకుని బాధ్యతలు చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి సభ్యులకు స్వామి వారి కండువాలు కప్పి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అడబాల తాతకాపు, జాలెం శ్రీనివాసరాజా, మొల్లేటి శ్రీనివాస్, తులా బ్రహ్మాజీ, బొంతు భాస్కరరావు, కంకిపాటి నరసింహారావు, కొమ్ముల జంగమయ్య, గుబ్బల దుర్గ పాల్గొన్నారు.

త్యాగోత్సవంగా బక్రీద్



అంగరలోని మసీదు



అంగర మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- సహనం, పరోపకారం, త్యాగాలకు ప్రతీక
- సమానత్వం, సామరస్యం ప్రాతిపదికగా పండగ
- నేడు బక్రీద్ పర్వదినం

కపిలేశ్వరపురం/రాయవరం: ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే పండగల్లో బక్రీద్ ఒకటి.

ముస్లిం సమాజం త్యాగోత్సవంగా భావించే బక్రీద్‌ను సోమవారం జరుపుకుంటున్నారు. త్యాగం, పరోపకారం, సహనం, సమానత్వం, సామరస్యం తదితర సుగుణాల ప్రబోధనల సమాహారమే బక్రీద్ పండగ. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని ముస్లింలు ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు.

రెండు నియోజకవర్గాల్లో ఇలా..

రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం, ద్రాక్షారామ, వెలంపాలెం, కె.గంగవరం, పామర్రు, చేదువాడ, కాజులూరు, మండపేట నియోజకవర్గంలోని మండపేట, ఏడిద, ద్వారపూడి, కేశవరం, అంగర, టేకి, కపిలేశ్వరపురం, రాయవరం, వెదురుపాక, లొల్ల, చెల్లూరు, పసలపూడి గ్రామాల్లోని మసీదుల్లో ఘనంగా జరుపుకుంటారు.

ఈరోజే ఎందుకంటే?

ఇబ్రహీం ప్రవక్త అల్లాపై చూపిన ప్రగాఢ విశ్వాసానికి, త్యాగానికి ప్రతీకగా ఈదుల్ జుహాన్‌ను పవిత్రంగా భావిస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం ఈదుల్ ఫితర్ తర్వాత రెండు నెలలకు 12వ నెల (జుల్ హజ్జ) 10వ రోజున బక్రీద్ జరుపుకుంటారు. ప్రార్థనల అనంతరం ఖుర్బానీ పాటిస్తారు.

ఎడారి ప్రాంతంతో అవినాభావ సంబంధం

ఎడారి దేశంలో జరుపుకునే హజ్ ఆరాధనకూ, ఇక్కడి ముస్లిం సమాజం జరుపుకునే ఈదుల్, అజ్‌హా పండగకు అవినాభావ సంబంధం ఉంది. ఇది ప్రపంచ మానవుల ఐక్యతను సూచిస్తుంది. అలనాటి మొఘలాయి చక్రవర్తులు ఈదుల్ జుహాను బక్ర్ ఈద్‌గా పిలిచేవారు. తర్వాత కాలంలో అది కాస్తా బక్రీద్‌గా మారిందని ముస్లిం పెద్దలు చెబుతారు.

ఇదీ బక్రీద్ కథ

ఒక రోజు ఇబ్రహీం ప్రవక్త తన చిన్నారి తనయుడు ఇస్మాయిల్ గొంతు కోస్తున్నట్టుగా కలగన్నాడు. దాన్ని దైవాజ్ఞగా భావించి కుమారుడు ఇస్మాయిల్‌తో సంప్రదించగా ఆ త్యాగానికి ఇస్మాయిల్ సిద్ధపడ్డాడు. కుమారుడి మెడపై కత్తిపెట్టి ×జుబహ్× చెయ్యడానికి ఉపక్రమించగా ఆ ఇరువురి త్యాగధనుల పట్ల దైవం ప్రసన్నుడయ్యాడు. నా పరీక్షలో మీరిద్దరూ సంపూర్ణంగా నెగ్గారని ఇక భౌతిక చర్యగా మిగిలిపోయిన బలి తతంగంతో నాకు నిమిత్తం లేదంటుంది దైవం. మీ త్యాగానికి గుర్తింపుగా స్వర్గం నుంచి ఒక దుంబాను పంపుతున్నానంటూ దైవవాణి పలికింది. అలా ఇస్మాయిల్ స్థానంలో ప్రసన్నమైన పొట్టేలును ×జుబహ్× చేశారు ఇబ్రహీం. ఆ మహనీయుల త్యాగస్మరణగానే బక్రీద్ పండగను జరుపుకుంటారు. స్తోమత ఉన్నవారు హజ్‌కు వెళ్తారు. లేనివారు ఇళ్ల వద్దే పండగను జరుపుకుని ఖుర్బాని ఇస్తారు.

పంచ సూత్రాలకు ప్రాధాన్యత

ప్రతి ముస్లిం ఇస్లాంలోని పంచ సూత్రాలైన అల్లాపై విశ్వాసం (ఇమాన్), ప్రార్థన (నమాజ్), ఉపవాసం (రోజా), దానం (జకాత్, మక్కాయాత్ర (హజ్) హజ్ అనే ఆచరించేందుకు పరితపిస్తారు. ఐశ్వర్యం, పేదరికమనే వ్యత్యాసాలు లేకుండా బక్రీద్‌ను జరుపుకుంటారు.

ఖుర్బానీ లోని ఆంతర్యమిదీ

అత్యంత పవిత్రమైందిగా భావించే ఖుర్బానీ వెనుక ఆంతర్యంలో ప్రేమ పూర్వక అంశాలెన్నో ఉన్నాయి. పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి పేదలకు ఒక భాగాన్ని, బంధువులకు ఒక భాగాన్ని పంచి మిగిలిన మూడో భాగాన్ని వారు స్వీకరిస్తారు. చనిపోయిన బంధువులను గుర్తు చేసుకుని వారి పేరున ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ.

సమానత్వానికి చిహ్నం బక్రీద్



మానవుల మధ్య అంతరాలు సమసిపోవాలని, సమానత్వమే శాశ్వతత్వమని తెలియజెప్పే పండగ బక్రీద్. మనుషులంతా మంచివారే. వారి మధ్య సయోధ్యను కోరుకునే పండుగగా బక్రీద్‌ను జరుపుకుంటాం.

–జాఫర్ హుస్సేన్, ద్రాక్షారామ, రామచంద్రపురం మండలం

కనీసం ఒకసారి హజ్ యాత్ర చేయాలి



ప్రతి ముస్లిం తన జీవితంలో కనీసం ఒకసారి విధిగా హజ్ యాత్ర చేయాలి. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో వెలసిన కాబాలో హజ్ చేయాలి. జిల్ హజ్ మాసంలో 9వ రోజు ఈ హజ్ జరుగుతుంది. ఆ రోజు ఉపవాసం ఉండి హజ చేస్తే చేసిన పాపాలన్నీ తొలగిపోతాయని ముస్లింలు విశ్వసిస్తారు.

– షేక్ మస్తాన్ వలీ, ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు, పసలపూడి, రాయవరం మండలం

త్యాగాల పండగ



బక్రీద్ పండగ మనిషిలోని దైవభీతిని, త్యాగ నిరతిని తెలుపుతుంది. అందుకే ఈ పండగను త్యాగాల పండగ అంటారు. చనిపోయిన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని వారి పేరున ఖుర్బానీ ఇవ్వడం ఈ పండగ ప్రత్యేకత.

– షేక్ అహ్మద్ బాషా, మసీదు నిర్వాహకుడు, వెదురుపాక, రాయవరం మండలం